ఆగని చోరీలు.. రైతుల బేజారు !

ఆరుగాలం కష్టించి పంటను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోపక్క నీటి మోటార్లను అపహరించుకుపోతున్న దొంగలతో మరిన్ని కష్టాలు ఎదుర్కొంటున్నారు అన్నదాతలు. మోటార్లు, సోలార్ ప్లేట్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగలను దొంగలు దోచుకుపోతుండటంతో పంటలకు నీరు ఎలా పెట్టుకోవాలో తెలియక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చోరీలను నియంత్రించాలని పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- రైతుల గోడు పట్టించుకోండి సారూ ?
- కోలలపూడిలో 200 మంది రైతుల మోటార్లు, వైర్లు, సోలార్ ప్లేట్లు చోరీ
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టని పోలీసులు
- ఆందోళనలో అన్నదాతలు



వ్యవసాయ భూమిలో చోరీకి గురైన సోలార్ ప్లేట్లు

మార్టూరు: వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లు, సోలార్ ప్లేట్లు, చోరీ జరుగుతున్న తీరుపై కోలలపూడి గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ భూముల్లో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను దొంగలు చోరీ చేస్తున్నారని పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులు తమ సాగునీటి అవసరాల కోసం బావులపై భాగాన మోటార్లు బిగించుకుంటారు. కొందరు రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసుకొని మోటార్లు బిగించుకుంటారు. మరికొందరు సోలార్ ప్లేట్లను అమర్చుకొని నీ వాటి ద్వారా నీటిని వినియోగించుకుంటారు. ఇవన్నీ కూడా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నందున చోరీ చేయడానికి దొంగలకు అనుకూలంగా ఉండటం గమనార్హం. దొంగలు బావులపై ఉన్న మోటార్లను దొంగిలించటంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నచోట వాటిని ధ్వంసం చేసి అందులోని రాగి తీగను చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు చెప్తున్నారు. అంతేకాక సోలార్ ప్లేట్‌లతోపాటు వాటికి ఉన్న వైరు ఫ్యూజులను కూడా దొంగలించి అమ్ముకుంటున్నట్లు రైతులు తెలిపారు.

తీవ్రంగా నష్టపోతున్న రైతులు..

వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు తరచూ దొంగతనాలు జరగడం వలన వేలాది రూపాయలు ఖర్చు చేసి వెంటనే రైతులు నీటి సరఫరా ఏర్పాటు చేసుకోలేకపోవడం వలన పంట నష్టాన్ని కూడా పొందాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సోలార్ పంపు సెట్లు ఉన్నచోట ఎక్కువగా చోరీ జరిగేవి మూడు ఫ్యూజుల సెట్టు దానికి అనుబంధంగా ఉన్న వైరు. ఇవి చోరీ జరిగిన చోట తిరిగి ఏర్పాటు చేసుకోవడం కోసం రైతుకు రూ.5 వేల వరకు ఖర్చు అవుతుంది. కొంత మంది రైతుల పొలాల్లో సోలార్ ప్లేట్లు మొత్తం కూడా చోరీకి గురవడం గమనార్హం. వీటి విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు.



కోలలపూడిలో విద్యుత్ మోటార్లు, సోలార్ ప్లేట్లు, వైర్లు పోగొట్టుకున్న బాధిత రైతులు

గ్రామంలో తరచూ జరుగుతున్న ఈ చోరీల వలన మొక్కజొన్న, మాగాణి, మామిడి తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ చోరీల బాధిత రైతులు కోలలపూడి గ్రామంలోనే 200 మందికి పైగా ఉండగా, కొంతమంది రైతుల పొలంలో రెండు మూడు పర్యాయాలు కూడా చోరీ జరిగిన బాధితులు కూడా ఉండటం గమనార్హం.

పట్టించుకోని పోలీసులు..

గత సంవత్సర కాలంగా చాలాసార్లు చోరీ విషయం మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం.. పోలీసులు వచ్చి పరిశీలించి ఫోటోలు తీసుకొని వెళ్లటం పరిపాటిగా మారటంతో ఫిర్యాదు చేయడం కూడా మానుకుంటున్నట్లు రైతులు చెప్పటం గమనార్హం. బావిపై తాను ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటారు చోరీకి గురి కావడంతో రూ.20 వేల అప్పు చేసి తిరిగి ఏర్పాటు చేసుకున్నానని రైతు తాతా సాంబయ్య తెలిపాడు. పంటల నష్టాన్ని కాపాడుకునేందుకు అప్పుచేసి వెంటనే తిరిగి నీటి సరఫరా ఏర్పాట్లు చేసుకుంటున్నామని పోలీసులు తగు చర్యలు తీసుకొని చోరీలు జరగకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ పరికరాల చోరీల బాధిత రైతులు కేవలం కోలలపూడి గ్రామంలోనే కాకుండా సమీప గ్రామాలైన బొల్లాపల్లి, ద్రోణాదుల, బొబ్బేపల్లి, చిమ్మిరిబండ తదితర గ్రామాల్లో కూడా వందలాది మంది రైతులు ఉండటం గమనార్హం. విద్యుత్ శాఖకు చెందిన అధికారులు కూడా ఈ చోరీల విషయమై పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని చెప్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



జనవరి 10న నా పొలంలో మందు పిచికారీ చేసి తిరిగి 16వ తేదీన పొలానికి వెళ్లాను. సోలార్ ప్లేట్లు చోరీకి గురైన విషయం గమనించి 112కు ఫోన్ చేశాను. వారి నుంచి వచ్చిన సమాచారంతో మార్టూరు సీఐ శేషగిరిరావు నాకు ఫోన్ చేసి విషయం ఏమిటి అని అడిగారు. జరిగిన విషయం చెప్పగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయమని చెప్పడంతో అలాగే ఫిర్యాదు చేశాను. ఫిర్యాదు కాపీ అడిగినా కూడా ఇవ్వలేదు. ఫిబ్రవరి 16 కూడా వెళ్లిపోయింది.

– బలగాని రామాంజనేయులు, రైతు

ప్రమాదకర వంతెనలతో ప్రమాదాలు

- ఆందోళనలో తీరప్రాంత గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బుర్లవారిపాలెంలో రెయిలింగ్ దెబ్బతిన్న వంతెన



ప్రమాదకరంగా ఉన్న వాడరేవు- పచ్చమొగిలి బ్రిడ్జి

చీరాల టౌన్: అవి తీర ప్రాంత గ్రామాలను కలిపే వంతెనలు.. నిత్యం తీరప్రాంత గ్రామాల నుంచి మండలానికి దూరంగా ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలు నిర్వహించే ప్రధాన బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలుతాయో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. వివరాల్లోకెళితే.. మండలంలోని వాడరేవు-పచ్చమొగిలి, బుర్లవారిపాలెం-పిట్టువారిపాలెం గ్రామాల మధ్యనున్న వంతెనలు కోతకు గురై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ వాడరేవు సముద్రంలో కలిసే ప్రదేశంలో జెట్టీవద్ద ఆరు గ్రామాలను కలుపుతూ వాడరేవు-పచ్చమొగిలి గ్రామాల మధ్య వంతెనను రూ.1.10 కోట్ల నాబార్డు నిధులతో 2003లో బ్రిడ్జి ఏర్పాటు చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఈరెండు వంతెనలు పిల్లర్లు కోతకు గురి కావడంతో పాటు కొద్ది భాగం కుంగిపోయింది.

ఏదైనా ప్రమాదాలు జరిగితే..

వాడరేవు-పచ్చమొగిలి మధ్య ఉన్న బ్రిడ్జి చీరాల మండలాన్ని బాపట్ల జిల్లాను కలుపుతుంది. చీరాల మండలంలోని వాడరేవు, పల్లెపాలెం మత్స్యకారులతో పాటు, బాపట్ల నియోజకవర్గంలోని అడివీధిపాలెం, దానవాయిపేట, పాండురంగాపురం మత్స్యకారులు ఈ బ్రిడ్జి వద్దే తమ పడవలు, బోట్లను లంగరు వేసి నిలుపుదల చేస్తారు. ఈబ్రిడ్జి ప్రమాదకరంగా మారడంతో తీరప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలానే బుర్లవారిపాలెంలోని బ్రిడ్జి బీటలువారి రెయిలింగ్ కూడా దెబ్బతింది. దీంతో పాటు రోడ్డు ధ్వంసం కావడంతో బ్రిడ్జి పటుత్వం కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువపై ఉన్న వంతెన కూడా దెబ్బతింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఉన్న ఈవంతెన కూడా ఏళ్లనాటి నుంచి ఉంది. పెను ప్రమాదాలు సంభవించి భారీగా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకముందే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జిలకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ఉన్న బ్రిడ్జిలు దెబ్బతినడంతో పాటు ప్రమాదకరంగా మారిన విషయం నా దృష్టికి వచ్చింది. బ్రిడ్జీలకు రెయిలింగ్‌లు, ఇతర మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా అన్నీ చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జిల సమస్యను ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, చీరాల.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

చీరాల: గంజాయి అమ్మకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఒన్‌టౌన్ సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రాత్రి చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మే పాత నేరస్తులపై నిఘాలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించామన్నారు. నిఘాతో పాటు సోదాలు నిర్వహించారు. గంజాయి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఒన్‌టౌన్ ఎస్సై కమలాకర్, సిబ్బంది ఉన్నారు

జాతీయ రహదారిపై సాగర్ నీరు



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న సాగర్ నీరు

జే.పంగులూరు: మొక్కజొన్న పైరుకు నీరు పెట్టి కాలువలో వదిలేయడంతో ఆనీరు జాతీయ రహదారిపై ప్రవహించింది. ఈఘటన మండలంలోని ముప్పవరం గ్రామంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కొంత మంది రైతులు మొక్కజొన్న పైరుకు కాలువ నీళ్ల పెట్టుకొని వెళ్లారు. అయితే ఆ నీరు పొలాల్లో కూడా జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డుకు చేరింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కొలతల ప్రకారం పనులు

జే.పంగులూరు: ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో కనీసం నాలుగు గంటలు పనిచేయాలి.. పని పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని పంగులూరు మండల ఏపీవో కే సంతోషం అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆరికట్లవారిపాలెం, బూదవాడ, కల్లవారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను అమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో అమె మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేయాలని, అప్పుడే కూలీ రూ. 300 వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సంఖ్య పెంచాలని, కూలీలకు పనిపై అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కావ్యను ఏపీవో సూచించారు.

జీబీఎస్ వ్యాధి లక్షణాలు గుర్తించాలి

ఇంకొల్లు (చినగంజాం): జీబీఎస్ వ్యాధి లక్షణాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి టీ అంజలి అన్నారు. జీబీఎస్ వ్యాధి బ్యాక్టీరియా, వైరస్ వలన వ్యాపిస్తుంది. జీర్ణకోశం, శ్వాసకోశంలో వచ్చే సంక్రమణలు కారణంగా జీబీఎస్ వ్యాధి రావడానికి అవకాశాలుంటాయని అన్నారు.జ్వరం, దగ్గు తరువాత ఎక్కువగా చెమటలు పోయటం, గుండె దడ, బీపీలో కూడా మార్పులు వస్తాయని తెలిపారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

19న విద్యుత్ అదాలత్

అద్దంకి రూరల్: ఈనెల19న స్థానిక విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు అద్దంకి డివిజన్ ఏఈ నల్లూరి మస్తాన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ ఎస్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరవుతారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలిక, అపరిష్కృత విద్యుత్ సమస్యలను ఈ వేదికను ఉపయోగించుకుని తక్షణ పరిష్కారం పొందాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పడవల ఘన నారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తారని ఆయన తెలిపారు. రెండు సబ్ స్టేషన్ పరిధిలో కొత్తపాలెం నుంచి పెదగంజాం వెళ్లే విద్యుత్ లైన్‌లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, పెద్దపల్లెపాలెం, రామచంద్రనగర్, పెదగంజాం, పల్లెపాలెం, గొల్లపాలెం, కోడూరివారిపాలెం, కాటంవారి పాలెం, నీలాయపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రిజిస్ట్రేషన్‌తోనే పథకాలు, రాయితీలు

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ 14 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు అందజేస్తుందని.. రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్వీపి కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలం పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో లింకైన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేరు నమోదు చేస్తారని కుమారి చెప్పారు. గుర్తింపు కార్డు ఉంటే పీఎం కిసాన్ పెట్టుబడి సాయంతో పాటు పలు రాయితీలు పొందే అవకాశం ఉందని ఏవో చెప్పారు.

నేటి నుంచి జ్ఞానజ్యోతిపై శిక్షణ

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై రెండు బ్యాచ్‌లుగా మంగళవారం నుంచి శిక్షణ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో డీ. సుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు ఏల్చూరు, బల్లికురవ మండలంలోని బల్లికురవ, కొప్పెరపాడులలో మంగళ, బుధ, గురువారాల్లో మొదటి బ్యాచ్‌కి, రెండో బ్యాచ్‌కు, శని, సోమ మంగళవారాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులను రిసోర్సు పర్సన్స్‌గా ఎంపిక చేశారని, ఎంపికైన కార్యకర్తలు విధిగా శిక్షణకు సకాలంలో హాజరుకావాలని ప్రకటనలో సీడీపీవో కోరారు.

ఒక్క రూపాయితో రూ.5 లక్షల బీమా



బీమాపై అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ సహాయ అధికారి

పర్చూరు (చినగంజాం): నెలకు ఒక రూపాయి చొప్పున ఐదు సంవత్సరాలకు రూ.60 చెల్లింపుతో ఐదు లక్షల వరకు ప్రమాద కార్మిక బీమా పొందవచ్చని పర్చూరు సహాయ కార్మిక అధికారి ఆర్ అబ్రహాం పేర్కొన్నారు. సోమవారం కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకోవటానికి వచ్చిన కార్మికులకు ప్రభుత్వం కల్పించే ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. గనులు, ఇంటి నిర్మాణం తదితర ప్రమాదకర పనులు చేసే కార్మికులకు ప్రమాదాలు సంభవిస్తే రూ.5 లక్షలు బీమా సౌకర్యంతో పాటు కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రసూతి ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.20 వేలు చెల్లిస్తుందని వివరించారు. ఇవి కాక కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం శిక్షణ కూడా ఇస్తుందని తెలిపారు. కార్మికులు అందరూ తమ పేర్లను కార్మికశాఖలో నమోదు చేసుకోవాలని కోరారు.

స్వామిత్వ సర్వే పరిశీలన



స్వామిత్వ సర్వే చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కారంచేడు: గ్రామాల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వేకు గ్రామస్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని గ్రామ కార్యదర్శి కేఎల్ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఆదిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో తమ సిబ్బందితో ఈ సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు గ్రామ కంఠంగా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసాలు చేస్తున్నవారు, ఖాళీగా ఉన్న స్థలాల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారి ఇళ్ల వద్ద ఈ సర్వేలు చేస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అన్ని రకాల సాయం



దివ్యాంగ చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ సెల్ సభ్యుడు

చినగంజాం: దివ్యాంగ విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చీరాల మండల లీగల్ సెల్ అడ్వకేట్ ఏ రామకృష్ణారెడ్డి అన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కస్తూరి బా విద్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దివ్యాంగులైన విద్యార్థులను కమిటీ సభ్యులు కలిసి అందుతున్న వసతులు, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుబ్బారావు, పారా లీగల్ వలంటీర్ ఎం వెంకట రామారావు, ప్రిన్సిపాల్ సుమాంజలి, సారథి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, మాఘ మాసం స్వాతి నక్షత్రం షష్టి తిథి సందర్భంగా మగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెవరేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ న్విహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

లోకోస్ యాప్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు

జే.పంగులూరు: లోకోస్ యాప్‌పై వీవోఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఏపీఎం అధ్యక్షతన వీవోఏల శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వీవోఏ యాప్‌పై అవగాహన కలిగి ఉండి, గ్రూప్ వివరాలన్నీ ఎస్ఈఆర్‌పీఎం పోర్టల్‌లో ఎంటర్ చేయాలన్నారు. ప్రతి గ్రూపు వారి అప్పులు, పొదుపులు, గ్రామ సంఘాల వివరాలు పొందుపరచాలని తెలిపారు. అనంతరం స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సంఘాలల్లో స్త్రీనిధి బకాయిలు పేరుకుపోయాయన్నారు. వాటిని రికవరీ చేసే విషయంలో వీవోఏలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు సాల్మన్, చంద్ర అకౌంటెంట్ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో లోకోస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

ఇంకొల్లు (చినగంజాం): మహిళా స్వయం సహాయక గ్రూపు సభ్యుల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం బీ అనూరాధ అన్నారు. వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాలకు లోకోస్‌పై సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న వివరాలను సైతం ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఏపీఎం అనూరాధ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం సహాయకులు, సీసీలు, అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

చీరాల టౌన్: పంచాయతీ కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారని ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం

చీరాల: ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది సోమవారం చీరాల మండలం ఆదినారాయణపురంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఈపూరుపాలెం ఇందిరానగర్ కాలనీకి చెందిన అంగడి రవి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా కలిగి ఉండుట, అమ్ముట నేరమని, నాటుసారాను నియంత్రించేందుకు నిరంతరం దాడులు నిర్వహిస్తామన్నారు.

24 రకాల పూలతో అమ్మవారికి అలంకరణ



పుష్పాలంకరణలో కామాక్షి అమ్మవారు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని కామాక్షి సోమేశ్వరాలయంలో స్వామి వార్ల 78వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి 24 రకాల పూలమాలలతో అలంకరణ నిర్వహించారు. 24 రకాల పుష్పాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని అమ్మవారికి వివిధ రకాల పుష్పాలను సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ వారోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలోని భద్రావతి సమేత భావనారుషి దేవాలయ ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి 21వ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, ఆకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలానే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయంత్రం పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రసాదాలు భక్తులకు అందించారు. బృందావన భజనలు, చిన్నారుల భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఉడతా భాస్కర పార్వతీశ్వరరావు, కార్యదర్శి జి.వెంకటసుబ్బారావు, కోశాధికారి జి.శ్రీనివాస్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.